


## హుండీ ఆదాయం రూ.67 లక్షలు

**ప్రజాశక్తి- సూళ్లూరుపేట:** సూళ్లూరుపేట శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి పరాకామణి (హుండీ లెక్కింపు) సోమవారం జరిగింది. 116 రోజులకు గాను రూ.67,98,889లు నగదు, విదేశీ కరెన్సీ యుఎస్ఎ డాలర్స్ 131, యూఏఈ దిరహమ్స్160, సౌదీ రియాల్స్ 7, ఇంగ్లాండ్ పౌండ్స్ 20, సింగపూర్ డాలర్ 30, ఆస్ట్రేలియా 20, కువైట్ ధీనార్, ఫేం హుస్ట్రై క్రొనర్ 300, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్ 100, యూరో 5 ఆదాయం చేకూరినది. ఈ కార్యక్రమం తిరుమూరు సుధాకర్ రెడ్డి, దేవస్థానము సిబ్బంది, మెప్మా సభ్యులు, విశ్రాంతి బ్యాంకు ఉద్యోగులు, పోలీస్‌శాఖ సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసబాబు పర్యవేక్షణలో సహాయ కమీషనరు, కార్య నిర్వహణాధికారి బి. ప్రసన్నలక్ష్మీ సమక్షంలో జరిగింది.



# కార్పొరేషన్ నుంచి తుడాకి 'శెట్టిపల్లి'

- అధికారులు చొరవతో సమస్య పరిష్కరించాలి
- కూటమి ప్రభుత్వం నమ్మకం కలిగించేలా పనులు చేయాలి

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్**

కొన్ని దశాబ్దాల నుంచి శెట్టిపల్లి భూముల సమస్య పరిష్కారం కావడం లేదు. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి.. పోయాయి.. అధికారులు హామీలు ఇచ్చారు.. మరిచారు.. కానీ భూమి సమస్య మాత్రం పరిష్కారం కాకపోగా మరింత జఠిలంగా మారింది. ఈ సమస్య పరిష్కారం కోసం ఏళ్ల తరబడి ఇటు ప్రభుత్వం.. అటు ప్రజాప్రతినిధుల చుట్టూ గ్రామస్తులు, భూమి యజమానులు తిరుగున్నా నేటికీ పరిష్కారం లభించకపోవంతో ప్రభుత్వాలపై శెట్టిపల్లివాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్, టిడిపి, వైసిపి తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడిన కూడా సమస్య కొలిక్కి వచ్చేలా కనబడటం లేదు. ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలతో శెట్టిపల్లి వాసులు బలైపోతున్నారు. ఉన్న భూమిని ఇటు వ్యవసాయం చేసుకోలేక అటు అవసరాల కోసం అమ్ముకోలేక తరతరాలుగా ఇబ్బందులు పడుతున్నారు. సిపిఎం పోరాట ఫలితంగా శెట్టిపల్లి భూముల పరిష్కారంలో అధికారుల్లో ప్రజాప్రతినిధుల్లో కదలికలు వచ్చాయి. గత వైసిపి ప్రభుత్వం శెట్టిపల్లి భూములు తుడా నుంచి కార్పొరేషన్‌కు బదలాయించింది. 100 ఎకరాలు కార్పొరేషన్ పరిధిలోకి వచ్చింది. ప్లాట్లు కలిగిన వారికి ప్రొసిడింగ్ పత్రాలు ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత వాటి పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం కూడా శెట్టిపల్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీలు ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు అవుతున్న మళ్లీ సమస్య పెండింగ్‌లోనే పడింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు శెట్టిపల్లి భూములు బదలాయించడం వల్ల ఆర్థిక వనరులు లేక తిరుపతి కార్పొరేషన్ తాము నిర్వహణ చేయలేమని చేతులెత్తేసింది. తాజాగా తుడకు ఆ భూములును బదలాయించారు. భూముల్లో లేఅవుట్లు వేసి వాటి ద్వారా వచ్చిన నిధులను ఆ భూముల అభివృద్ధి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ కూడా విసి అయిన ఎన్.మౌర్య కలెక్టర్ వెంకటేశ్వర్లు ప్రతిపాదించారు. కలెక్టర్ ఈ ప్రతిపాదన ప్రభుత్వానికి పంపనున్నారు. ఈ ప్రతిపాదన క్యాబినెట్లో పెట్టి ఆమోదం తెలుపుతారు.. లేదంటే ప్రత్యేక జీవో ఇచ్చి ఆమోదిస్తారు.. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోనుంది.. వేచిచూడాలి. ఇది ఇలా ఉండగా శెట్టిపల్లి భూముల సమస్యను కార్పొరేషన్ నుంచి తుడాకు బదలాయించడం పట్ల శెట్టిపల్లి వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పరిష్కారానికి నోచుకోని శెట్టిపల్లి భూములు

### 76 ఏళ్ల గా సమస్య అలానే ఉంది..

దాదాపు 76 సంవత్సరాలుగా రైతులకు ఎలాంటి హక్కులు లేకుండా ఆన్‌సెటిల్‌మెంట్‌గా ఉన్న భూములకు ఇప్పటివరకు సర్వహక్కులు రాలేదు. స్వాతంత్యం వచ్చిన నాటి నుంచి తమ అనుభవంలో ఉన్న భూములకు సర్వహక్కులు కల్పించాలని మూడు తరాలుగా పోరాటం చేస్తున్న గ్రామస్తులకు విముక్తి లభించడం లేదు. భూసమస్యకు లభిస్తే రైతులకు రూ.2వేల కోట్ల లబ్ధి చేకూరనుంది.

### రైతులను ఒప్పించే భూములు..

శెట్టిపల్లి భూములు రైతు నొప్పించే గత ప్రభుత్వ హయాంలో తీసుకోవడం జరిగింది. రైతులు వద్ద వ్యవసాయభూమి ఉంటే 30 శాతం వారి కేటాయించి 70 శాతం తీసుకునేలా చేశారు. లేఅవుట్ల ద్వారా ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉన్న ఇళ్ల స్థలాలకు సంబంధించి 50/50 నిష్పత్తి ప్రకారం తీసుకోవడం జరిగింది.

### తుడాకు అప్పగిస్తే అభివృద్ధి..

శెట్టిపల్లి భూములు గతంలో తుడా పరిధిలోనే ఉండేది. వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత శెట్టిపల్లి భూములు పరిష్కారం కోసం ప్రయత్నాలు జరిగాయి. అయితే వైసిపి అధికారంలో ఉన్న సమయంలో అప్పటి చంద్రగిరి, తిరుపతి ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడంతో శెట్టిపల్లి భూములు కార్పొరేషన్‌లోకి బలవంతంగా విలీనం చేయించారు. కార్పొరేషన్ 100 ఎకరాలు తీసుకోవడం జరిగింది కానీ అభివృద్ధి చేయాలంటే కోట్లాది రూపాయలు కావాల్సి ఉంది. అంత నిధులు లేకపోవడంతో మళ్లీ తుడాకు అప్పగించాలని నిర్ణయానికి వచ్చారు. తుడాలో విలీనం చేస్తే తుడా కొంత భూమిని తీసుకుని వాటిని అభివృద్ధి చేసి దాని ద్వారా వచ్చిన నిధులను శెట్టిపల్లి భూముల అభివృద్ధికి ఖర్చు చేయనుంది. ఉదాహరణకి 100 ఎకరాలు అభివృద్ధి చేయాలంటే తుడాకు రూ.100 కోట్లు ఖర్చు అవుతుంది. తుడా వద్ద కూడా అంత నిధులు లేవు. లేఅవుట్లు వేసి వచ్చిన నిధుల్లో అభివృద్ధికి ఖర్చు చేస్తామని తుడా విసి ఎన్.మౌర్య తెలిపారు

### తుడాతోనే శెట్టిపల్లికి న్యాయం

**- రాధాకృష్ణ, శెట్టిపల్లి భూ పోరాట కమిటీ నాయకులు**



శెట్టిపల్లి భూముల సమస్య పూర్తిస్థాయి పరిష్కారానికి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తుడాకు బదలాయించడం ద్వారానే న్యాయం జరుగుతుంది. మూడు తరాల నుంచి పోరాటాలు చేస్తున్నా కానీ నేటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. రైతులు, భూ యాజమానుల ఉద్యమాలతో అధికారి యంత్రాంగం కదిలింది. ప్రభుత్వం ఈ సమస్యను నానబెట్టడం కాకుండా పూర్తిస్థాయి సమస్య పరిష్కారం చేయాలి.

**శెట్టిపల్లి లో భూముల వివరాలు**

- మొత్తం భూముల వివరాలు- 636 ఎకరాలు
- సిఆర్ఎస్ భూములు - 97.5 ఎకరాలు
- మిగులు భూములు - 538.5 ఎకరాలు
- ప్రభుత్వ భూమి - 146 ఎకరాలు
- వ్యవసాయ భూమి - 145 ఎకరాలు
- 21 లేఔట్ల ద్వారా ప్రైవేట్ వ్యక్తులు ఉన్న భూమి -123 ఎకరాలు

**వ్యవసాయ పొలాల్లో రైతులకు వెళ్లే భూమి వాటా 30 శాతం**
**ప్రభుత్వానికి మిగిలే భూమి 70 శాతం**
**లేఅవుట్లో ఇళ్ల స్థలాల్లో యాజమాన్లకు కేటాయించే భూమి 50 శాతం**
**ప్రభుత్వ వాటాగా మిగులు భూమి 50 శాతం**
**భూములపై రైతులకు సర్వహక్కులు పొందేవారు 2012 మంది**
**మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తుడాకు బదిలీ భూమి 100 ఎకరాలు**

తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణకు

## ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్

**టీటీడీ అదనపు ఈఓ, జిల్లా ఎస్పీ**



ద్విచక్రవాహనాలను ప్రారంభిస్తున్న టిటిడి అదనపు ఈవో, జిల్లా ఎస్పీ

**ప్రజాశక్తి- తిరుమల:** తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణ ధ్యేయంగా చేసుకుని, క్రమబద్ధీకరించాలనే ముఖ్య ఉద్దేశంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఆధునికీకరించబడిన 12 ద్విచక్ర వాహనాలను ఆదివారం తిరుమల సిఆర్ఓ కార్యాలయం వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా టిటిడి అదనపు ఈవో మాట్లాడుతూ తిరుమలలో భక్తులకు ఎట్టి పరిస్థితుల్లో కూడా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకూడదనే ముఖ్య ఉద్దేశంతో తక్షణ చర్యలలో భాగంగా ఆదివారం అధునాతన సాంకేతిక పరికరాలు అమర్చిన 12 ట్రాఫిక్ ద్విచక్ర వాహనాలను ప్రారంభించామన్నారు. నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాలలో భక్తుల వాహనాలను పార్క్ చేయిస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడదని, ఈ ప్రణాళికను జిల్లా ఎస్పి ఆధ్వర్యంలో తిరుమల ట్రాఫిక్ పోలీసు వారు అమలు చేస్తారన్నారు. తిరుమల ట్రాఫిక్ సమస్యపై అధ్యయనం చేయడానికి పోలీసు, టిటిడి విజిలెన్స్ అధికారులు నిపుణులతో కూడిన కమిటీని ఇదివరకే ఏర్పాటు చేయడం జరిగింది, వారు ప్రతిపాదించిన స్వల్పకాలిక ప్రణాళికలో భాగంగా ఈ వాహనాలను ప్రారంభించామని, త్వరలో దీర్ఘకాలిక ప్రణాళికను నివేదిస్తారని తెలిపారు. నివేదిక మేరకు పోలీసు, టీటీడీ విజిలెన్స్, ఇతర శాఖల భాగస్వామ్యంతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ సమీకృత వ్యవస్థను తిరుమలలో ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తిరుమలను 5 జోన్లుగా విభజించి, ప్రతి జోన్లో ఒక ట్రాఫిక్ మొబైల్ నిరంతరం ఉండే విధంగా నియమించి వారి జోన్‌లో ఎలాంటి ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీస్ కంట్రోల్ రూమ్ సూచనల మేరకు పనిచేస్తారన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వాహనాల ఫోటోలు తీసి, పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా జరిమానాలు విధించనున్నట్లు పేర్కొన్నారు. తిరుమలలో ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి తప్పించుకొని వెళ్లినా కూడా వారికి అలిపిరి చెక్ పాయింట్ వద్ద జరిమానా విధించే విధంగా రాబోయే రోజులలో పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. తిరుమలకు వచ్చే భక్తులు కూడా నిర్దేశిత పార్కింగ్ ప్రాంతాలలోనే వాహనాలను పార్క్ చేయాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయుటకు ట్రాఫిక్ పోలీసు వారికి సహకరించాలని, భక్తులు కూడా పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, తిరుమల డిఎస్పి విజయ శేఖర్, సిఐలు హరిప్రసాద్, ట్రాఫిక్, విజయ్ కుమార్, వన్ టౌన్, శ్రీరాముడు, టు టౌన్, ఎస్సైలు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో ఎమ్మెల్సీ పిడుగు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**



విశాఖ ఎమ్మెల్సీ పిడుగు రాంప్రసాద్ సోమవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఆయనకు జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్చార్జి కోట వినుత, చంద్రబాబు దంపతులు సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామీ, అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనం పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

## శ్రీనివాస స్పోర్ట్ కాంప్లెక్స్‌లో చెస్ పోటీలు





గెలుపొందిన బాల బాలికలతో కోచ్ ఆనంద్ మోహన్

**ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):** తిరుపతి నగర పరిధిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి జిల్లా పరిధిలోని అండర్ -14, అండర్ -17 బాలబాలికల విభాగంలో చెస్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో అండర్ -14 బాలికల విభాగంలో త్రిపురాంబిక సిరిగిరి సాత్విక, మోక్షిత ప్రతిభ కనపరచి మొదటి, రెండవ, ఆరవ స్థానాలను కైవసం చేసుకున్నారు. అండర్- 14 బాలుర విభాగంలో సాత్విక్ కృష్ణ ద్వితీయ స్థానంలో గెలుపొందారు. అండర్ -17 బాలుర విభాగంలో రెడ్డి దేదీప్, సిరిగిరి పార్థసాయి, గౌరవ్ వెంకట్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. గెలుపొందిన వీరందరూ ఈనెల 29, 30న జరిగే రాష్ట్రవ్యాప్త చెస్ పోటీలకు వెళ్లరున్నారని ఆనంద్ చేస్తే అకాడమీ కోచ్ పిఆర్.ఆనంద్ మోహన్ తెలిపారు.

## సమస్యల పరిష్కార వేదిక 'ప్రజా దర్బార్': ఎమ్మెల్యే

**ప్రజాశక్తి- శ్రీకాళహస్తి:**



ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'ప్రజా దర్బార్' కార్యక్రమమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. ప్రతి సోమవారం 'ప్రజా దర్బార్' కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్జీదారుల నుంచి పెద్దసంఖ్యలో స్పందన వచ్చింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రతి అర్జీదారుని సమస్యను స్వయంగా విన్నారు. సమస్యను సంబంధిత అధికారికి బదిలీ చేసి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆ వివరాలను ఆయా అధికారుల 'లాబుక్'లో నమోదు చేసుకోవాలనీ, ఎప్పటిలోగా పరిష్కరిస్తారు? లేకుంటే ఎందుచేత పరిష్కారం కాలేదన్న సమాచారాన్ని సదరు అర్జీదారుని మొబైల్ నంబర్‌కు ఓటిపి రూపంలో తెలియజేయాలని సూచించారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన సుమారు 170 ఫిర్యాదుల్లో అత్యధిక భాగం భూ సమస్యలేననీ, ఇవన్నీ గత ఎమ్మెల్యే పాపాలని విమర్శించారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన 'భూ' అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. చెరువులు, కాలువలు, రోడ్డు పోరంబోకు స్థలాల్లో గత వైసిపి నాయకులు నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా తరహాలో కూల్చివేస్తామని స్పష్టం చేశారు. తహశీల్దార్ మధుసూదన్ రావు, అధికారులు, టిడిపి నేతలు గాలి మురళి నాయుడు, మునిరాజా నాయుడు, జయచంద్ర నాయుడు, దావులూరి రామానాయుడు పాల్గొన్నారు.

# 'క్యూ' కట్టిన అర్జీదారులు

### సకాలంలో సమస్యలకు పరిష్కారం : కలెక్టర్

**ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):** తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ప్రజలు అర్జీలతో క్యూ కట్టారు. మధ్యాహ్నం 2 గంటలకు కూడా కలెక్టరేట్లో అర్జీదారులు వారి సమస్యల పరిష్కారం కోసం గంట తరబడి వేచి ఉన్నారు. కొందరు తల్లులు చంటి పిల్లలను తీసుకోచ్చిన గంటతరబడి వారిని సముదాయించలేక అక్కడే నిద్రపుచ్చారు. ఎక్కువ సంఖ్యలో జిల్లా నలుమూలల నుంచి భూ సమస్యలతో పాటుగా ఫించన్లు, రెవెన్యూ, డిపిఒ విభాగాలకు సంబంధించి అధికారులకు అర్జీలు అందాయి. గూడురులోని మైథిలి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ యాజమాన్యం గత ప్రభుత్వంలో అమలు చేసిన వసతి దీవెన ద్వారా రూ.30 వేల రూపాయలు బకాయి ఉన్నారని రెండు వారాల్లో కట్టాలని చెప్పడం, చెల్లించని 18 మంది బిఎస్సీ నర్సింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులను యాజమాన్యం తెల్లవారు జామున నాలుగు గంటలకు నిద్రలేపి బయటకు పంపేయడం గురించి కలెక్టరు విద్యార్థినులు వివరించారు. కలెక్టర్ స్పందించి వేంటనే విచారణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు నూతన హాస్టల్ భవనాలను ఏర్పాటు చేయాలని, అలానే విద్యాలయాలు సమీపంలో నిబంధనలను అతిక్రమించి మధ్యం దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారని, దీంతో సమీపంలో విద్యార్థినుల హాస్టల్స్ వద్ద తీవ్రఅసౌకర్యమైన వాతావరణం ఏర్పడుతోందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ పరిశీలించాలని సంబందిత అధికారిని పిలిచి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.



విద్యార్థుల సమస్యలు వింటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

**నా భర్తను చంపేశారు.. న్యాయం చేయండి.**

**-జగజ్యోతి, చిగురువాడ, తిరుపతి రూరల్ మండలం, తిరుపతి జిల్లా.**



నా భర్తను మిద్దెపై నుండి తోసేసి చంపారు. ఇప్పటి వరకు పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. రేణిగుంట వైసిపి పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ 2023 ఆగస్టు 14వ తేదీ నా భర్త సి.ఆంజినేయులు రెడ్డిని మిద్దెపై నుండి తోసేసి చంపడమే కాకుండా వివేకానంద రెడ్డి కాలనీలో వేసిన సిసి రోడ్డుకు సంబంధించి బిల్లు నగదు రూ.6 లక్షల 40 వేల రూపాయలను ప్రభాకర్ అక్రమంగా డ్రా చేసుకున్నాడు. నా భర్తను చంపిన ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలి, అక్రమంగా డ్రా చేసిన నగదును తిరిగి ఇప్పించాలి.

**నా కూతురు చావుకు కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేయాలి**

**-పద్మజ, భాకరాపేట, చంద్రగిరి మండలం, తిరుపతి జిల్లా**



అల్లారు ముద్దుగా పెంచుకున్న నా కూతురు హరిత చావుకు కారణమైన అల్లుడు ఆనందరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి తగిన చర్యలు తీసుకోవాలి. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పంచాయతీ బోడిరెడ్డిగారిపల్లెకు చెందిన హరితను అదే గ్రామానికి చెందిన ఆనంద్ రెడ్డికి ఇచ్చి వివాహం చేశాం. పెళ్లి తరువాత మూడు నెలల గర్భవతీ అని చూడకుండా తీవ్ర ఇబ్బందులు పెట్టారు. దీంతో నా కూతురు హరిత వారి వేధింపులు భరించలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. నా బిడ్డ ఆత్మహత్య చేసుకునేలా హింసపెట్టిన ఆనంద్‌రెడ్డిని అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని ఇన్నేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

### ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్**

**తిరుపతి టౌన్:** ప్రజాసమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజాపిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 32 వినతులు అందాయని, అన్ని వినతులను హెల్త్ ఆఫీసర్ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, డీఈలు, సెక్రటరీ రాధిక, ఏసిపి బాలాజీ, రమణ, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాదవ్, రవి, మేనేజర్ హాసీమ్, అకౌంటెంట్ రమేష్, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవనశాఖ అధికారి హరికృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.




### వర్మీ కంపోస్టు కార్నర్ ప్రారంభం

**తిరుపతి (మంగళం):** తిరుపతి జిల్లా కలెక్టరేట్లో చెత్త నుంచి సంపద కేంద్రం ద్వారా తయారైన వర్మీ కంపోస్టు ఎరువుల అమ్మకాన్ని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం ప్రారంభించారు. జిల్లా పంచాయతీ అధికారి సుశీలదేవి ప్రోత్సాహకం మేరకు తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలో చెత్త నుండి సంపద కేంద్రం ద్వారా ఉత్పత్తి అయ్యే వర్మీ కంపోస్టు ఎరువులు కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండేలా అమ్మకం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కరకంబాడి పంచాయతీలో చెత్త నుండి సంపద కేంద్రం ద్వారా 2017 నుండి వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేస్తున్నట్లు ఆ పంచాయతీ కార్యదర్శి ఎంజి.రమేష్ తెలిపారు.




వర్మీ కంపోస్టు ఎరువులను ప్రజలకు అందిస్తున్న కలెక్టర్

ఆయాన్ డిజిటల్ జోన్ కేంద్రంలో

## టెట్ అభ్యర్థుల అగచాట్లు

- ప్రధాన కేంద్రంలో గేట్లు తెరవకుండా ఇబ్బంది పెట్టిన సిబ్బంది
- పరీక్ష కేంద్రంలో అస్తవ్యస్తంగా సెల్ఫోన్లో నిర్వహణ

**ప్రజాశక్తి - క్యాంపస్**

రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆదేశాలతో ఏపీ టెట్ 2024 పరీక్షలను ఈనెల మూడో తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించారు. ఇందులో భాగంగా అత్యధిక మంది తెలుగు, సోషల్ మెథడాజీలకు అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను తిరుపతి ప్రధాన కేంద్రంగా ఎంచుకున్నారు. అయితే రెండవ ఆప్షన్‌గా తిరుపతి ప్రధాన కేంద్రంగా ఎంచుకున్న విద్యార్థులతో పాటు, ప్రథమంగా తిరుపతి ప్రధాన కేంద్రంగా ఎంచుకుని అభ్యర్థులకు జూపార్క్ రోడ్డులోని ఆయాన్ డిజిటల్ కేంద్రంలో సోమవారం సోషల్ మెథడాలజీకి సంబంధించిన పరీక్ష జరిగింది. పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్ నిర్వహణ అస్తవ్యస్తంగా, అడ్డదిడ్డంగా జరిగిందని అభ్యర్థులు వాపోయారు. సెల్ఫోన్ భద్రపరిచేందుకు దాదాపు గంట నుంచి గంటన్నర సమయం తీసుకున్నారని, అక్కడ పనిచేసే సిబ్బంది కూడా దురుసుగా ప్రవర్తించి, ఆసాంఘికమైన, అసభ్య పదజాలంతో మాట్లాడటం జరిగిందని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఏపీ టెట్ పరీక్షకు తిరుపతిలోని ఆయాన్ డిజిటల్ జోన్‌లో అనంతపురం, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, కర్నూలు, నంద్యాల, కడప తదితర సుదూర ప్రాంతాల నుంచి కూడా అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి రావడం జరిగింది. సెల్‌ఫోన్‌కు ఒక కౌంటర్ మాత్రమే ఏర్పాటు చేయడం ద్వారా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు బ్యాగులను ఒకచోట లైన్‌లో నిలబడి ఇవ్వడం, సెల్ఫోన్లను మరొకచోట లైన్‌లో నిలబడి ఇవ్వడంతో దాదాపుగా రెండు గంటలు పైగా వేచి చూడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆయాన్ డిజిటల్ జోన్ జూపార్క్ వద్ద ఉన్నటువంటి పరీక్ష కేంద్రంలోని వాచ్మెన్, సిబ్బంది, ఇతర అధికారులు కూడా అభ్యర్థులపై సరిగా ప్రవర్తించలేదని తెలిపారు. పరీక్షా కేంద్రంలో పాదరక్షలను ఉంచేందుకు ప్రత్యేకమైన సదుపాయం కల్పించలేదని, తాగునీటి సదుపాయం కూడా అరకొర ఏర్పాటు చేశారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ఆశతో ఉన్నతంగా పరీక్ష రాయాలని వచ్చిన తమకు పరీక్షా కేంద్రంలో నిర్వహణ, తాగునీటి సౌకర్యం లేకపోవడం ఎంతో నిరాశ నిస్పృహలకు గురిచేసిందని వాపోయారు. అంతేకాకుండా పరీక్ష రాసిన సమయంలో కూడా పలుమార్లు మైకుల ద్వారా అనౌన్స్మెంట్ చేయడం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. పరీక్ష కేంద్రానికి రెండు ప్రధాన గేట్లు ఉన్న దాని గుండా లోనికి ప్రవేశించ నీయకుండా... ఎక్కడో దూరంగా వెనుక వైపు నుంచి అనుమతించడం దారుణమన్నారు. పరీక్ష నిర్వాహకులకు అభ్యర్థులు అంటే నిర్లక్ష్యం హెచ్చు మీరి పోయిందన్నారు. పరీక్షా సమయం మించిపోయిన కూడా కొంతమంది అభ్యర్థులకు లాగిన్ చేయకపోవడం చాలా దారుణమైన విషయమని, ఇటువంటి పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థుల పట్ల నిర్లక్ష్యం వహించిన సిబ్బంది, పరీక్ష కేంద్రాన్ని వెంటనే రద్దు చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు.



సెల్‌ఫోన్లు భద్రపరిచే కేంద్రం వద్ద వేచి ఉన్న అభ్యర్థులు

తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా

## మురళీ, బాలచంద్ర ఘనవిజయం

**ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):** ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తిరుపతి ప్రెస్‌క్లబ్ ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో అధ్యక్ష కార్యదర్శులుగా మురళి, బాలచంద్ర ఘనవిజయాన్ని సాధించారు. సోమవారం ఉదయం నుండి ప్రారంభమైన కౌంటింగ్‌లో విజేతలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి బొమ్మల మురళి ప్రకటించారు. తదుపరి పదవులకు కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మొత్తం ఓటర్లు 562 మంది ఉండగా 517 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో అధ్యక్షుడు మురళి 211 ఓట్ల మెజారిటీ, ప్రధాన కార్యదర్శి బాలచంద్ర 161 ఓట్ల మెజారిటీ, కోశాధికారి చంద్రబాబు 137 ఓట్ల మెజారిటీతో మురళి, బాలచంద్ర ప్యానల్ మంచి మెజారిటీని, విజయాన్ని సొంతం చేసుకుంది. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారి చంద్రబాబు మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ సభ్యుల సంక్షేమం, ఇచ్చిన హామీల అమలకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ వద్ద విజయోత్సవ వేడుకలను నిర్వహించారు.



అధ్యక్షుడు మురళి, కార్యదర్శి బాలచంద్ర, కోశాధికారి చంద్రబాబు

# ఉపాధి సామాజిక తనిఖీలో డొల్లతనం

**ప్రజాశక్తి -సత్యవేడు:** జాతీయ ఉపాధి హామీ సామాజిక తనిఖీలు, గ్రామసభలు నామమాత్రంగానే నిర్వహిస్తున్నారు. ఇటీవల సత్యవేడు మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీలో డొల్లతనం బహిర్గతం కావడమే ఇందుకు నిదర్శనం.

**అధికారిక పట్టికలో ఇష్టానుసార మార్పులు**

ఉపాధి హామీ పథకానికి సంబంధించి సత్యవేడు మండలంలోని 28 పంచాయతీలలోనూ గ్రామ సభలకు సంబంధించిన తేదీల పట్టిక అధికారికంగా ధ్రువీకరించబడి పాత్రికేయులకు అందిన తర్వాత తుపాను కారణంగా పట్టికలో మార్పులు అంటూ ఇష్టానుసారంగా గ్రామసభల తేదీలను మారుస్తూ ఆ విషయాన్ని గోప్యంగా ఉంచుకొని నిర్వహిస్తున్నారు. గ్రామ సభలు, సామాజిక తనిఖీలకు సంబంధించి కూలీలకు ఎలాంటి సమాచారం లేదంటూ వాపోతున్నారు. ఆంబాకం పంచాయతీ, కొత్త మారి కుప్పం పంచాయతీలలో సోమవారం నిర్వహించిన సామాజిక తనిఖీలను గురించి అక్కడి కూలీలకు సైతం అనేకులకు తెలియకపోవడం శోచనీయం. సోమవారం ఆంబాకం పంచాయతీలో నిర్వహించిన సామాజిక తనిఖీలో దాదాపు 400 మంది ఉపాధి కూలీలు ఉన్న గ్రామంలో నుండి కేవలం 30 మందితోనే గ్రామసభ నిర్వహించటం బాధాకరం అంటున్నారు.

**నిధుల దుర్వినియోగం**

ఆంబాకం పంచాయతీలో నిర్వహించిన సామాజిక తనిఖీలో మస్టర్లలో కూలీల సంతకాలు లేకుండానే ఖాతాలకు నిధులు జమచేయడం, నిర్వహించిన సివిల్ పనుల కంటే అదనంగా పనులు లేకుండానే 842 క్యూబిక్ మీటర్లకు సుమారు 1,80 వేల రూపాయల నిధులు అదనంగా కూలీల ఖాతాలకు మళ్లించడం ఒక్క పంచాయతీలోనే జరిగినది. మొత్తంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న సామాజిక తనిఖీలకు సంబంధించి కూలీలు స్పందిస్తూ ఉన్నతాధికారులు స్పందించి సామాజిక తనిఖీలను పటిష్టం చేయాలని కోరుతూ కూలీల గోడు వినేవారు లేరని కొంతమంది గ్రామాలలో లేకున్నా వారి ఖాతాల్లోకి కూలీలు జమ చేస్తున్నారన్నారు. నిజంగా కూలీలకు వెళ్లే వారికి కనీసం కూలీ దొరకడంలేదని వాపోతున్నారు.

**వెలుగు చూస్తున్న రూ. లక్షల నిధుల అక్రమం**


ఉపాధి హామీ సామాజిక తనిఖీ సభలో మాట్లాడుతున్న అధికారులు

# క్రైం న్యూస్

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ప్రజాశక్తి -రామచంద్రాపురం(పాకాల):** పాకాల రైల్వే స్టేషన్లో మూడవ ప్లాట్‌ఫామ్ వద్ద సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 60 నుండి 70 సంవత్సరాలు వుంటుందని తెలిపారు. అనారోగ్యం వల్ల చనిపోయినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని, అతడి జేబులో వున్న ఓపీ టిక్కెట్ ఆధారంగా పరిశీలించగా శ్రీనివాసులు, వయస్సు (65) అని మాత్రం వుందని, గుర్తు తెలియని ఆసుపత్రి ఓపీ టిక్కెట్టు, కొన్ని మందులు దాని వున్నాయని తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు పాకాల రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పాకాల రైల్వే పోలీసుల ఫోన్ నెంబర్లు 9440416642, 9494228854 లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు పేర్కొన్నారు.

## కారు నుంచి అకస్మాత్తుగా మంటలు

**ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి):** కారు నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగి వాహనం పూర్తిగా దగ్ధమైన సంఘటన చంద్రగిరి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. చంద్రగిరి మండలంలోని పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారిపై తొండవాడ సమీపంలో సోమవారం తెల్లవారుజామున కారు ఇంజిన్లో మంటలు వ్యాపించి వాహనం పూర్తిగా దగ్ధమైంది. మంటలు గమనించిన ప్రయాణికులు కారు నుంచి దిగి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు సమాచారం అందించడంతో తిరుపతి అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. రాజమండ్రికి చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులు గోల్డెన్ టెంపుల్ నుంచి స్వగ్రామానికి వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చంద్రగిరి పోలీసులు తెలిపారు.

## ఇద్దరు కార్మికుల మధ్య ఘర్షణ - ఒకరు మృతి

**ప్రజాశక్తి -సత్యవేడు:** ఇద్దరు కార్మికుల మధ్య నెలకొన్న ఘర్షణలో ఒకరు మృతి చెందిన సంఘటన స్థానిక శ్రీసిటీలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు శ్రీసిటీ పరిధిలోని చెంచి గ్రామానికి సమీపంలో బాల్ కంపెనీ వుంది. దీని పక్కనే షెల్టర్లో జార్ఖండ్, ఇతర ప్రాంతాలకు చెందిన కార్మికులు నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో షెల్టర్లో నివసిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు శికారి ముర్ము (39) అక్కడే నివసిస్తున్న మరో కార్మికుడు విక్రమ్ ముర్ము తల్లిని దూషించాడు. దీంతో జీర్ణించుకోలేని కార్మికుడు విక్రమ్ ముర్ము తల్లిని దూషించిన శికారి ముర్ముతో ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో ఘర్షణ పడ్డాడు. ఇద్దరూ తాగిన మైకంలో ఉండడంతో శికారి ముర్ము రాయిపై పడ్డాడు. ఈ నేపథ్యంలో విక్రమ్ ముర్ము చేతితో శికారి ముర్మును పిడి గుద్దులు గుద్దడం వల్ల శికారి ముర్ము అక్కడికక్కడే చనిపోయాడు. మృతి చెందిన శికారి ముర్ముకు నిందితుడు విక్రమ్ ముర్ము వరుసకు చిన్నాన్న అవుతాడని స్థానికులు చెబుతున్నారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలోని పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కాంట్రాక్టు లేబర్ ఏజెన్సీ ప్రతినిధి పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని శ్రీసిటీ శ్రీనివాసులు చెప్పారు. అయితే పరారులో ఉన్న నిందితున్ని త్వరలో పట్టుకుంటామన్నారు.

# ఆక్రమణల తొలగింపు


ఆక్రమణను తొలగించిన ఆర్అండ్‌బి అధికారులు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్:** గూడూరు పురపాలక సంఘం పరిధిలోని చెన్నూరు లోని కట్టాలమ్మ దేవస్థానం వద్ద ఉన్న బస్ షెల్టర్ సమీపంలో ఆర్అండ్‌బి రోడ్డులో కబ్జాకు గురైన స్థలాన్ని ఆర్అండ్‌బి ఈఈ రామాంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. ఆ స్థలాన్ని కబ్జా చేసి చదును చేసి మట్టిని పోసి ఆక్రమించాడు. దీంతో ఆర్అండ్‌బి ఈఈ దృష్టికి ఈ విషయం తీసుకు వెళ్లారు. స్పందించిన ఆయన సోమవారం ఆక్రమణను తొలగించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి ఈఈ రామాంజనేయులు మాట్లాడుతూ ఎవరైనా ఆర్అండ్‌బి స్థలాలను ఆక్రమిస్తే చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో సిపిఎం నియోజక వర్గ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, చెన్నూరు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బి ఈఈకి ధన్యవాదాలు తెలిపారు.

## 'ప్రకృతి వ్యవసాయం' పై స్పందన

**ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ:** మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపిడివో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజింగ్ న్యాచురల్ ఫామింగ్' కార్యక్రమం సోమవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ రైతులు పండించిన పంటను ఏటీఎం మోడల్ వేసిన కూరగాయలు, ఆకుకూరలు స్పందనలో విక్రయించారన్నారు. వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి ఆయన వివరంగా తెలిపారు. ప్రకృతి కూరగాయల వల్ల అనేక రోగాలకు దూరమవుతారని మంచి ఆరోగ్యం వస్తుందని ప్రకృతి వ్యవసాయంతో అధిక సంపాదన వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం ద్వారానే కూరగాయలు పండించి చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారిణి భారతి, ఏపిఎం మునెయ్య, ఏపీవో భానుప్రియ, ఐసిడిఎస్ సూపరువైజరు శిల్ప వెంకటాచలం, జయలక్ష్మి, ఆశ, రజిని, రేవతి, భారతి, రైతులు పాల్గొన్నారు.

## దౌర్జన్యాలను ఎదుర్కొంటాం: వైసిపి

**ప్రజాశక్తి -పెళ్లకూరు:** టిడిపి నాయకులు గతంలో ఎన్నడూ లేని విధంగా అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వీటిని సమర్థవంతంగా ఎదుర్కోవడం పెళ్లకూరు మండలం నుంచి ప్రారంభిస్తామని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం పేర్కొన్నారు. పెళ్లకూరు మండలంలోని చిల్లకూరులో ఆదివారం రాత్రి ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ చోటుకున్న విషయం విదితమే. ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వైసిపి నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు కావాలనే దౌర్జన్యాలకు పాల్పడు తున్నారని, గతంలో ఎన్నడూ లేని విధంగా అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడు తున్నారని వీటిని ఎదుర్కొంటామని అది పెళ్లకూరు మండలం నుంచి ప్రారంభ మవుతుందన్నారు.

## ఘర్షణతో పార్టీకి సంబంధం లేదు: టిడిపి

**ప్రజాశక్తి -పెళ్లకూరు:** పెళ్లకూరు మండలంలోని చిల్లకూరులో ఆదివారం రాత్రి ఇరు గ్రూపుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణకు పార్టీతో ఎలాంటి సంబంధం లేదని టిడిపి సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే విజయశ్రీ పేర్కొన్నారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఈ ఘర్షణ లకు, పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, ఇది వారి వ్యక్తిగత విషయాలని, గొడవ పడిన ఇద్దరూ గతంలో ఒకే పార్టీకి చెందిన వారని, గతంలో గ్రీన్ ప్లే మేనేజర్ని రాకేష్ రెడ్డి, లోకేష్‌ల చేత దాడి చేయించాడని, సత్యనారాయణ రెడ్డి గతంలో వారికి ఇవ్వాల్సిన డబ్బులు అడగడానికి వస్తే అందుకు రాజకీయం అంటగట్టి రాద్ధాంతం చేస్తున్నాడన్నారు. ఈ ఘర్షణకు పార్టీకి ఎలాంటి ప్రమేయం లేదని, వారి మధ్య ఆర్థిక లావాదేవీలే కారణమని తెలిపారు. దీని వెనుక ఎవరు మాట్లాడినా ఆధారాలు బహిర్గతం చేయాలని లేకుంటే ఇంతటితో ఈ గొడవలకు నాంది పలికి ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి ప్రయత్నించాలని హితవు పలికారు.

## అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి: ఎమ్మెల్యే


రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

**ప్రజాశక్తి -దొరవారిసత్రం:** నేడు కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. పల్లెపండుగలో భాగంగా దొరవారిసత్రం మండల పరిధిలోని మినమలమూడికి రూ.5 లక్షలు, తొగరాముడికి రూ.10లక్షలు, మీజూరుకు రూ.10 లక్షలు, శ్రీధనమల్లికి రూ.5 లక్షల రూపాయలు మంజూరైన నిధులతో శిలాఫలకం, భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మినమల మూడి సభలో మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా, ఆయా గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశల వారీగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యలు, గ్రామాలకు అవసరమైన పనుల విషయంలో తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నేడు మనం చేసే అభివృద్ధి ఆధారంగా 2029 ఎన్నికల్లో గెలుపొందే అవకాశం ఉంటుం దన్నారు. దీపావళికి మహిళలకు ఉచిత గ్యాస్ పంపిణీ చేస్తారని, పేదలకు ఉచిత ఇసుకను కల్పించిన ఘటన ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమం లోఎంపీడీవో గోవర్ధన్, ఆర్ఐ ప్రవీణ్ రాయల్, వీఆర్వో జ్ఞానేంద్ర, మధు, మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## నాపై అవినీతి ఆరోపణలు నిరూపిస్తారా?

ఎమ్మెల్యే పులివర్తి నాని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తినాని

**ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి):** 'మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రెడ్డి, అతని అనుచరులు పేటీఎం బ్యాచ్ తన కుటుంబంపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, వాటిని నిరూపిస్తారా?' అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సవాల్ విసిరారు. పసలేని ఆరోపణలు చేయటం, బురద చల్లడం మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రెడ్డి పనేనని, ఇకనైనా అలాంటివి మానుకోవాలన్నారు. స్థానిక ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఆరు మండలాల నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, జనరల్ సెక్రటరీలు, బూత్ ఇన్‌ఛార్జిలు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి సోమవారం శిక్షణ ఇచ్చారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలు విడిచిన పోలీసు అమర వీరులకు నివాళు లర్పించారు. పార్టీ సభ్యత్వం వంద రూపాయలు మాత్రమే నని తెలిపారు. సభ్యత్వం తీసుకున్న వారి సంక్షేమం కోసం పార్టీ ఎన్నో కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఏదైనా ప్రమాదవశాత్తు కార్యకర్త మృతి చెంది నప్పుడు మట్టి ఖర్చులకు 10 వేల రూపాయలు ఇస్తుందని, పార్టీ సభ్యత్వం ఉన్న వ్యక్తికి గతంలో 2లక్షలు రూపాయలకు బదులు 5 లక్షలు రూపాయలకు ఆర్థిక చేయూతను పెంచి ఇవ్వనుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం తిరుమలరెడ్డి, , ఎన్ చిన్నబాబు, టి కేశవుల నాయుడు, పి విజయ్ కుమార్, సి జనార్దన్ చౌదరి, నంగా పద్మజా రెడ్డి, సురేష్ నాయుడు,ఈశర్ రెడ్డి వి, సుబ్రహ్మణ్యం నాయుడు, గౌస్ బాషా, బిరుదుల భాస్కర్ రెడ్డి, వై శ్రీధర్ నాయుడు, ఏ మధు నాయుడు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## మార్కెటింగ్ సదుపాయం : డాంగే యాదవ్

**ప్రజాశక్తి -సత్యవేడు:** ఆహార ఉత్పత్తులు తయారుచేసే స్వయం సహాయక సంఘాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని తిరుపతి జిల్లా సత్యవేడు గ్రామీణాభివృద్ధి సంస్థ( వెలుగు) ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్ చెప్పారు. సోమవారం స్థానిక శ్రీశక్తి భవనంలో జరిగిన సంఘ మిత్రుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం డాంగే యాదవ్ మాట్లాడుతూ ఆహార ఉత్పత్తులు తయారు చేసే సంఘాలు ఓఎన్డిసిలో రిజిస్టర్ చేసుకోవాలి అన్నారు.

# కనీస వేతనాలు అమలు చేయాలి

**స్కూలు స్వీపర్స్ దీక్ష**

**ప్రజాశక్తి -వెంకటగిరి:** తమకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ స్కూలు స్వీపర్సు యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద సోమవారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డీపల్లి చెంగయ్య, అరవ మంజుల మాట్లాడుతూ స్కూల్ స్వీపర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంఈఓ కార్యాలయాల వద్ద ఒకరోజు దీక్ష చేపట్టామన్నారు. అందులో భాగంగానే వెంకటగిరి ఎంఈఓ కార్యాలయం వద్ద వారి సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఒకరోజు దీక్ష చేపట్టామన్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ స్కూల్ స్వీపర్సుకి ప్రస్తుతం 6వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారని ఈ జీతంతో కుటుంబాలు గడవక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. కనీస వేతనాల చట్టం ప్రకారం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలల నుండి జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నాలుగు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలనెలా క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలన్నారు. క్యాజువల్ లీవులు అమలు చేయాలని, లేదంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ ప్రసాద్, పి సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ పాఠశాలల శానిటరీ కార్మికులు పాల్గొన్నారు.

## ఇండస్ట్రీయల్ రోబోటిక్‌పై శిక్షణ

**ప్రజాశక్తి -కోట :** కోట మండలంలోని స్థానిక ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థులకు ఇండస్ట్రీయల్ రోబోట్ కంట్రోల్ అండ్ ప్రోగ్రామింగ్‌పై బెంగళూరు చెందిన ప్రముఖ కంపెనీ డై ఫ్యాక్టో కంపెనీకి చెందిన ఇంజనీర్ల ఆధ్వర్యంలో ఐదు రోజుల శిక్షణ తరగతులను కళాశాల సంచాలకులు డాక్టర్ వి విజయ్ కుమార్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పరిశ్రమలో రోబోటిక్స్ పై విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని అందువల్ల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంపెనీ ఇంజనీర్ నందగోపాల్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పరిశ్రమలు డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ వైపు అడుగులు వేస్తున్నాయని అందువల్ల రోబోటిక్స్‌పై మంచి అవగాహన ఉన్న మెకానికల్ విద్యార్థులకు చాలా ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇంజనీర్ ప్రోమీత్ కుమార్ పాత్ర మాట్లాడుతూ మెకానికల్ విద్యార్థులకు మల్టీ డొమైన్ స్కిల్స్ ఎంతో అవసరమన్నారు. వినియోగించుకోవాలి కోరారు. ఈ సందర్భంగా విభాగ అధిపతి డాక్టర్ విక్రమ్ కుమార్ మాట్లాడుతూ గత సంవత్సరం డేఫ్యాక్టో కంపెనీ ద్వారా మన విద్యార్థులకు మంచి అవకాశాలు వున్నాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రమోద్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# రోడ్లు బురదమయం.. పట్టించుకోని అధికారులు..



**ప్రజాశకి-బుచ్చినాయుడు కండ్రిగ:** మండల కేంద్రంలోని బి సి కాలనీలోని రోడ్లు చినుకు పడితే బురదమయం అవుతుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు ఉషారాణి పేర్కొన్నారు. సోమవారం బీసీ కాలనీకి చెందిన మహిళలు తమ గోడును ఆమె ముందు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షం వస్తే నీరు నిల్వ వుండడంతో మురుగుగా మారి దోమలకు నివాసంగా మారిందని, దీంతో కాలనీవాసులు విష జ్వరాలకు గురై ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. రోడ్లకు ఇరువైపులా సైడ్ కాలవలు లేక పోవడంతో వర్షం వస్తే వీధులన్నీ బురద మయం అవుతున్నాయని తెలిపారు. ఈ కాలనీలో ఆరు వీధులు ఉన్నాయి. అయితే ఏ ఒక్క వీధికి సిమెంట్ రోడ్డు లేకపోవడం దారుణం. ఎంపీడీవో కార్యాలయం, తహశీల్దారు కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ కాలనీలో కనీస వసతులు లేకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీవాసుల కష్టాలు పరిష్కరించాలని కోరుతున్నారు.

# ఆకలి తీర్చడం, ఆరోగ్య కల్పనే లక్ష్యం

**రోగులకు భోజన పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నాని**


ఆస్పత్రిలో వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నాని

**ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి):** రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్య సంరక్షణతో పాటు ఆకలి తీర్చడమే లక్ష్యమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ ( నాని) అన్నారు. సోమవారం చంద్రగిరి 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఉచిత భోజన పథకాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌లు చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్చి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బందిని నియమించారన్నారు. ప్రమాదాల మృత దేహాలను భద్రపరి చేందుకు మార్చురీ గదిని ఏర్పాటు చేశామన్నారు. చంద్రగిరి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఉచితంగా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. వైద్యం పొందుతున్న రోగులకు స్వయంగా భోజనం పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రోగులు సమయానికి భోజనం చేసి తగిన వైద్యాన్ని పొంది ఆరోగ్యంతో ఇళ్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు వి సుబ్రహ్మణ్యం నాయుడు, గుడిపల్లి సురేష్ రెడ్డి, ఎస్ గౌస్ బాషా, ఆర్ మునిరత్నం రాయలు, సింగు సుధా, లంకెల్ల లలిత, అమ్ములు, సక్కూరి ధనుంజయ రెడ్డి, వేణుగోపాల్, ఏజీపల్లి బాలకృష్ణ, పి జయచంద్రారెడ్డి, వి రమేష్ రెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అబాకస్ పోటీల్లో విశ్వభారతి విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి- శ్రీకాళహస్తి:** తమిళనాడు రాజధాని చెన్నైలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణం గోపాలవనంలోని విశ్వభారతి ఇంగ్లీషు మీడియం పాఠశాల ఏడవ తరగతికి చెందిన ఇరగ చరిష్మ మొదటి బహుమతి సాధించింది. చెన్నైకు చెందిన 'అబాకస్ అండ్ మెంటల్ అర్థమెటిక్ టీచర్స్ అసోసియేషన్' ఈ అంతర్జాతీయ అబాకస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన ఇరగ చరిష్మకు నిర్వాహకులు బంగారు పతకం, ప్రశంసాపత్రం అందించారు. అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన ఇరగ చరిష్మను సోమవారం విశ్వభారతి పాఠశాల కరస్పాండెంటు దేరంగుల శోభ, ప్రధానో పాధ్యాయు లు దేరంగుల శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడంతో పాటు అభినందిం చారు. చరిష్మను ఆదర్శంగా తీసుకుని ఇలాంటి పోటీల్లో బహుమతులు సాధించాలని వారు ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థు లకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతీయ రెజ్లింగ్ పోటీలకు ఎంజీఎం మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు



**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** స్థానిక బైరాగిపట్టెడలోని మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు విజయవాడలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కుస్తీ పోటీలు పాల్గొన్నారని అందులో 8వ తరగతి చదువుతున్న జ్యోతిర్మయి 54 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో గెలిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు కదివి రవి తెలిపారు. 7వ తరగతి చదువుతున్న టి.ప్రణీత 30 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో గెలిచి గోల్డ్‌మెడల్ సాధించిందన్నారు. వీరు ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్పూర్‌లో జరుగబోయే జాతీయస్థాయి అండర్- 14 విభాగంలో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.ప్రసన్నలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన హిందూజా (స్పోర్ట్స్ శిక్షకురాలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్) విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పి.మునెయ్య, హేమంత్ కుమార్‌తోపాటు విద్యార్థులను అభినందించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:**

పుత్తూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో రైల్వే క్రాసింగ్ అండర్ గ్రౌండ్ మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 గంటల నుండి 10.30 గంటల వరకు గేట్ పుత్తూరు లోని రజక కాలనీ ఓల్డ్ మున్సిపల్ ఆఫీసు ఏరియా, పుత్తూరు పట్టణంలోని తిరుపతి రోడ్డు ఏఎంసీ కళ్యాణ మండపం వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడి శంకరయ్య , అర్బన్ ఎఇ జై సాయి సోమవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

## ఘనంగా డాక్టర్ జనార్ధన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ జనార్ధన్‌రెడ్డి

**ప్రజాశక్తి - గూడూరు టౌన్:** ప్రముఖ ప్రజా డాక్టర్ జనార్ధన్ రెడ్డి 70వ జన్మదిన వేడుకలు సింహపురి రెడ్డి సంక్షేమ సంఘ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేదల డాక్టర్ గా పేరు పొందారన్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ఆయన ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. ఆయన భవిష్యత్ లో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సనత్ కుమార్ రెడ్డి, బండి ధనంజయ రెడ్డి, నెలబల్లి సిద్ధారెడ్డి, ప్రజేంద్ర రెడ్డి, మూలి హర నాథ్ రెడ్డి, ఆమం చెర్ల భాస్కర్ రెడ్డి, కిషోర్ రెడ్డి, రాధా కృష్ణ రెడ్డి, హరనాథ్ రెడ్డి , కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

# డెలివరీ బాయ్స్ చేతివాటం

**బ్లాక్‌లో గ్యాస్ సిలిండర్ల అమ్మకాలు**

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** గ్యాస్ సిలిండర్ల పంపిణీలో అవకతవకలు అరికట్టేందుకు ఇటీవల హెచ్పీ గ్యాస్ కంపెనీ ఓటిపి విధానాన్ని ప్రవేశపెట్టినా డెలివరీ బాయ్స్ చేతివాటం ఆగడం లేదని వినియోగదారులు వాపోయారు. కంపెనీ నిబంధనల ప్రకారం గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారునికి వెంటనే ఓటీపీ నంబరు వస్తుంది. సిలిండర్ ను ఇంటికి తీసుకు వచ్చిన తర్వాత ఓటిపిని వినియోగదారుని నుంచి తీసుకొని పంపిణీ చేయాల్సి ఉంది. అయితే డెలివరీ బాయ్స్ ఇంటి వద్దకు రాకుండానే ఫోన్ ద్వారా ఇదిగో సిలిండర్ను తీసుకు వస్తున్నామని నమ్మబలికి ఓటిపిని తెలుసుకొని బ్లాక్ లో అధిక ధరలకు మరొకరికి విక్రయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ఈ విషయమై డీలర్ రవికుమార్ ని విచారించగా తప్పిదాన్ని గుర్తించి వెంటనే మరో సిలిండర్ను వినియోగదారునికి పంపిణీ చేశామని తెలిపారు. ఇక పై వినియోగదారులు ఇంటి వద్దకు సిలిండర్ తో వచ్చిన బాయ్స్ కు ఓటిపిని తెలిపి బిల్లు మొత్తాన్ని మాత్రమే చెల్లించాలని గ్యాస్ డీలర్ రవికుమార్ తెలిపారు.

# ఘనంగా భరత్ నాయుడు 'బర్త్‌డే'

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:**

యువ కూటమినేత భరత్ నాయుడు జన్మదిన వేడుకలు సోమవా రం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా అభిమానులు, శ్రేయోభి లాషుల సమక్షంలో భరత్ నాయుడు కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. కూటమి ప్రభుత్వ లక్ష్యాలను, పథకాలను ప్రజల్లోకి తీసు కెళ్తున్న భరత్ నాయుడు మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని అభిమా నులు ఆకాంక్షిం చారు. అనంతరం పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



## 'మద్యం షాపును మరో చోటికి మార్చాలి'

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** పట్టణంలోని స్థానిక ఎల్ఐసి కార్యాలయం పక్కన ఉన్న మద్యం షాపును వేరొక చోటికి మార్చాలని సిపిఐ పుత్తూరు పట్టణ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులకు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుత్తూరు పట్టణం పరిధిలో ఎల్ఐసి కార్యాలయం వద్ద ప్రలు, ఆఫీసుకు వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే మద్యం షాపును మరో చోటికి మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రమేష్ , అనిల్, కాసి పాల్గొన్నారు.

## మహిళా వ్యాపారవేత్తలకు శిక్షణ: విసి ఉమ

**ప్రజాశక్తి - క్యాంపస్ :** మహిళా వ్యాపారవేత్తలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, యునైటెడ్ నేషన్స్ ఏషియన్ అండ్ పసిఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఫర్ డెవలప్మెంట్ సంయుక్తంగా వైఫై డిఎక్స్ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ కార్యక్రమం మూడు రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఉప కులపతి ఆచార్య వి ఉమ వివరించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సావేరి అతిథి గృహంలో సోమవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ 'విమెన్ ఐసిటీ ఫ్రాంటియర్ ఇనిషియేటివ్' వైఫై డిఎక్స్‌గా నూతనంగా రూపుదిద్దుకొని, మహిళా వ్యాపారవేత్తలను డిజిటల్ ప్రపంచంలో ముందుకు తీసుకువెళ్లడానికి అవసరమైన శిక్షణలు, సామర్థ్యాలను అందించేందుకు రూపొందించామన్నారు. ఈ కార్యక్రమానికి కియాంకు, డైరెక్టర్, యుఎన్ ఎపి సిఐసిటి వారు విచ్చేయనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని, డీన్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఆచార్య పి. విజయలక్ష్మి, పిఆర్ఓ డాక్టర్ ఎన్. శ్రీరజిని పాల్గొన్నారు.

## 'ప్రైవేటు వాణిజ్య కార్యక్రమాలకు ఇవ్వడం దారుణం'

**ప్రజాశక్తి - క్యాంపస్ :** ఈనెల 26వ తేదీన ఒక ప్రైవేటు వాణిజ్య కార్యక్రమానికి శ్రీ వేంకటేశ్వర విద్యాలయం స్టేడియంను అద్దెకివ్వడం దారుణమని వైయస్సార్ విద్యార్థి విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షులు ఓబుల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సిటీ స్టేడియం ను ప్రైవేట్ వాణిజ్య కార్యక్రమాలకు అద్దెకి ఇవ్వడం, యూనివర్సిటీ స్టేడియం పేరు చెప్పి భారీ ఎత్తున ఎంట్రీ ఫీజు అసలు చేయడం యూనివర్సిటీ నైతిక విలువలను తగ్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీ స్టేడియంలో గతంలో అనేక కార్యక్రమాలు జరిగాయని ఎప్పుడు కూడా ఎంట్రీ ఫీజు పెట్టి భారీ మొత్తంలో వసూలు చేయలేదని, భారీ ఎత్తున ఎంట్రీ ఫీజు వసూలు చేస్తున్న యూనివర్సిటీ ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారా? అని ప్రశ్నించారు. అవినీతి పాల్పడుతున్న అధికారుల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఓబుల్ రెడ్డి కోరారు.

## పోర్టబుల్ మైక్ వితరణ

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** మండలంలోని పరమేశ్వర మంగళం హైస్కూల్ కు రమాదేవి జ్ఞాపకార్థం ఆమె భర్త రామకృష్ణ పోర్టబుల్ మైక్ ను వితరణ చేశారు. సోమవారం ఆర్ రమాదేవి ఎస్ ఏ (పిఎస్) సంస్మరణ సభను ఆమె భర్త రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు 10వేల 500 రూపాయలు విలువగల పోర్టబుల్ మైక్ ఆయన వితరణగా అందించారు. గత సవత్సరం ఎస్ఎస్సి ఎక్సమ్ లో ఫస్ట్ మార్క్స్ సాధించిన డి కీర్తన కు 2వేల రూపాయలు, సెకండ్ మార్క్స్ సాధించిన ఎం మిత్రకు వెయ్యి రూపాయలు ప్రోత్సాహక బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో రమాదేవి సోదరులు ఆర్ భాస్కర్ నాయుడు సోదరి ఆర్ ఉమాదేవి పాఠశాల హెచ్ ఎం, టీచర్స్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి -కోట :** కోట మండలంలోని కేశవరం పంచాయతీలో పల్లె పండు గను సోమవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు ఎమ్మెల్యే పాశం.సునీల్ కుమార్ హాజర య్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్లె పండుగను నిర్వహించడం సంతోషదాయకంగా ఉందని, పంచాయతీ అభివృద్ధికి పలు పనులకు శంకుస్థాపన చేశా మన్నారు. గూడూరు నియోజక వర్గంలో టిడిపి ఎమ్మెల్యేగా తాను గెలవ డానికి ప్రధాన పాత్ర పోషించింది పేద ప్రజలేనని తెలిపారు. చిట్టేడులో ఉండే జీవీఆర్ ఫ్యాక్టరీ యాజ మాన్యం సిద్ధమ్మ కండ్రిగ గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం ఎనిమిది లక్షల రూపాయల ఆర్వో ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.